సాక్షి
శ్రీకాకుళం
సోమవారం : 3 : ఏప్రిల్ : 2023



ఆధార్ అప్‌డేట్ చేశారా..?

ఆధార్ అప్‌డేట్ చేసుకునే వేళయ్యింది. పదేళ్ల కిందట కార్డు తీసుకున్న వారంతా అప్‌డేట్ చేసుకోవాలి. - 8లో



వ్యక్తి అనుమానాస్పద మృతి

మురపాకలో ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	కనిష్ఠం	గరిష్ఠం			
ఆమదాలవలస	34°	22°	పాతపట్నం	35°	23°
ఇచ్ఛాపురం	34°	23°	రణస్థలం	33°	23°
పలాస	32°	21°	కొత్తూరు	33°	22°
టెక్కలి	34°	22°	నరసన్నపేట	33°	24°
			శ్రీకాకుళం	33°	21°

రంజాన్ వేళలు

ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
6.12	4.29

సాగుకు సాయం



నరసన్నపేట మండలం నర్సింగపల్లిలో రైతు సంఘానికి (సీహెచ్‌సీ)కి మంజూరైన ట్రాక్టర్, ఇతర పరికరాలను అప్పగిస్తున్న ఏడీ, ఏఓ తదితరులు

- వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా రైతులకు పరికరాలు
- రెండో విడత పంపిణీకి రంగం సిద్ధం
- ఏప్రిల్‌లో మెగామేళా

నరసన్నపేట: అన్నదాతలకు రెండో విడత యంత్రాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద.. రైతు భరోసా కేంద్రాల వారీగా కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతులకు అవసరమైన పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. రానున్న ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకుని రెండో విడతలో యంత్రాల పంపిణీకి అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. మొదటి విడతగా గత జూన్‌లో మెగా మేళా నిర్వహించి 225 ట్రాక్టర్లు, మరో 35 కోత, నూర్పు యంత్రాలు (కంబైండ్ హార్వెస్టర్లు) మరో 65 గ్రూపులకు ఇతర పరికరాలు పంపిణీ చేశారు. ఈ మేరకు రూ.10 కోట్లు సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం వెచ్చించింది. రెండో విడతలో 331 ఆర్‌బీకేల్లో యంత్ర పరికరాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకూ 155 గ్రూపులు ఆసక్తి చూపించాయి. పరికరాల మొత్తం ఖరీదులో 50 శాతం మొత్తాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేశాయి. వీరిలో 144 గ్రూపులు ట్రాక్టర్ల కోసం డబ్బులు డిపాజిట్ చేశారు. వీరందరికీ యంత్రాల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 5వ తేదీ వరకూ డబ్బులు కట్టేందుకు రైతు సంఘాలకు అవకాశం ఇచ్చారు.

అన్నదాతల్లో హర్షాతిరేకాలు



ఒకప్పుడు పెద్ద రైతులు మాత్రమే వ్యవసాయంలో యంత్రాలు ఉపయోగించేవారు. చిన్న, సన్న కారు రైతులు సీజన్‌లో యంత్ర పరిరాలు దొరక్క ఇబ్బంది పడేవారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని అమలు చేయడం ద్వారా పరికరాలు గ్రామాల్లో అందుబాటులోకి వస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ అద్దెకే అధునాతన యంత్రాలు లభిస్తాయని రైతులు అంటున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా రానున్న ఖరీఫ్‌లో పనులు చేపట్టడానికి వీలుగా సీహెచ్‌సీల ద్వారా రైతులకు యంత్రాలు సబ్సిడీపై ఇస్తున్నాం. మొదటి విడత విజయవంతం కాగా ఇప్పుడు రెండో విడత పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల రెండు లేదా మూడో వారంలో మెగామేళా నిర్వహించి రైతులకు శ్రీకాకుళంలో యంత్రాలు పంపిణీ చేస్తాం. – కె.శ్రీధర్, వ్యవసాయ శాఖ జేడీ

ట్రాక్టర్ మంజూరైంది



ఐదుగురితో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. మాకు ట్రాక్టర్‌తో పాటు నూర్పు యంత్రం, రోటావేటర్, ఫుల్ వీల్, ఆఫ్‌వీల్ సెట్‌లు, నాగలి సెట్, దమ్ము సెట్ అవసరమైంది. అధికారులకు చెబితే డబ్బులు కట్టాలన్నారు. కట్టాము. అవసరమైన పరికరాలు మంజూరు చేశారు. చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఈ విధంగా పరికరాలు సబ్సిడీతో అందించడంతో ఎంతో మేలు జరుగుతుంది. – ముద్దాడ కృష్ణారావు, బొరిగివలస

గ్రామ స్థాయిలోనే యంత్ర సేవా కేంద్రాలు

జిల్లాలో 656 రైతు భరోసా కేంద్రాలు ఉండగా మొదటి విడత పోనూ మిగిలిన ఆర్‌బీకేల్లో కస్టమర్ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) 331 ఏర్పాటు చేశారు. దీంట్లో 155 సీహెచ్‌సీల్లో రైతులు ముందుకు వచ్చి ఇంప్లిమెంట్స్ కోసం డబ్బులు కట్టారు. ఈ మేరకు గ్రౌండింగ్ ప్రక్రియ చురుగ్గా జరుగుతుంది. యూనిట్ ఖరీదులో 40 శాతం సబ్సిడీ రూపంలో ప్రభుత్వం భరిస్తోంది. రైతు గ్రూపులు పది శాతం వాటా భరిస్తే మిగిలిన 50 శాతం మొత్తం లోను రూపంలో డీసీసీబీ సమకూర్చుతుంది. ఆర్‌బీకేల వారీగా సాగు చేసే ప్రధాన పంటలను బట్టి యంత్రాలు, యంత్ర పరికరాలు ఎంపిక చేసుకొనే అవకాశాన్ని రైతు గ్రూపులకు ఇచ్చారు.

మృత్యు కాలువ

- వంశధార కాలువలో మునిగి ముగ్గురు మృతి
- మృతుల్లో తండ్రీకొడుకులతో పాటు మరొకరు



తులసీరాజు మృతదేహం

కోటబొమ్మాళి: నీరు కన్నీరైంది. కాలువ చావు కబురు అందించింది. మండలంలోని నిమ్మాడ పరిధి రాజపురం వంశధార కాలువలో స్నానానికి దిగిన ముగ్గురిని మృత్యువు మింగేసింది. నిమ్మాడకు చెందిన కాలేపు నాగరాజు (38) అతని కుమారుడు తులసీరాజు(9) తో పాటు నాగరాజు స్నేహితుడు రాజాంకు చెందిన వెంకటరమణ(37) ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

నాగరాజు, రేవతి దంపతులు రాజాంలోని ఒక జూట్‌మిల్లులో పనిచేస్తున్నారు. వీరి పిల్లలు తులసీరాజు, కిరణ్మయి నిమ్మాడలో రేవతి తల్లి ఏసమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. పిల్లలను చూసేందుకు తల్లిదండ్రులు వారానికోసారి నిమ్మాడ వస్తుంటారు. అదే క్రమంలో శనివారం రేవతి, నాగరాజు, అతని స్నేహితుడు వెంకటరమణ నిమ్మాడకు వచ్చారు. ఆదివారం తండ్రీకొడుకులతో పాటు వెంకటరమణ కూడా రాజపురం వంశధార కాలువ, కాలి వంతెన వద్దకు ఉదయం 9.30 గంటలకు స్నానం కోసం వెళ్లారు. అయితే సాయంత్రమైనా వారు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో నాగరాజు భార్య రేవతి చుట్టుపక్కల అంతా గాలించారు. సాయంత్రం 6.30 గంటలకు కాలువలో బాలుడి మృతదేహం కాలువలో తేలడంతో స్థానికులు తల్లికి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కాలువ గట్టుకు చేరుకుని చూడగా అక్కడ బండి, చెప్పులు, దుస్తులు కనిపించాయి. బాలుడి మృతదేహం కనిపించినా మిగతా ఇద్దరి ఆచూకీ మాత్రం లభించలేదు.

అర్ధరాత్రి వరకు గాలింపు..

గల్లంతైన వారికి వెతికేందుకు గజ ఈతగాళ్లను తెప్పించేందుకు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డికి విన్నవించామని ఎస్‌ఐ షేక్‌మహమ్మద్ అలి తెలిపారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో స్థానిక అగ్నిమాపక సిబ్బంది రాత్రిపూట కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. చాలాసేపు వెతికాక 11 గంటల ప్రాంతంలో మిగిలిన ఇద్దరి మృతదేహాలు కనిపించాయి. మృతదేహాలను కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సమాచారం. రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కటింగ్‌కు వెళ్లి వచ్చి..

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరు ముగ్గురు సెలూన్ షాప్‌కు వెళ్లి స్నానం కోసం కాలువ వద్దకు వచ్చారు. అయితే ముందు బాలుడు ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో.. అతడిని కాపాడేందుకు నాగరాజు, అతని వెంట వెంకటరమణ కాలువలోకి దూకి తిరిగి రాలేక ప్రాణాలు కోల్పోయారు.



నాగరాజు, వెంకటరమణ మృతదేహాలను ఒడ్డుకు చేర్చుతున్న ఫైర్ సిబ్బంది

న్యూస్‌రీల్

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా జరిగే పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి 17వ తేదీ వరకు జరగనున్న ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా ఈ ఏడాది జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 1023 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరికోసం 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. అలాగే ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 1727 మంది విద్యార్థులు హాజరు కానుండగా, వీరి కోసం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఇంటర్ ప్రాక్టికల్స్ కోసం 5 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు మొదలై సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలలో ఉండనుంది. తనిఖీ బృంధాలను నియమించారు. సెల్‌ఫోన్లు పరీక్ష కేంద్రాలకు తీసుకురావడం నిషేధమని డీఈఓ గార పగడాలమ్మ, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లియాఖత్ ఆలీఖాన్ స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల సీఎస్‌లు, డీవోలతో ఏర్పాట్లపై ఇప్పటికే సమీక్షించి పలు సూచనలు చేశారు. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షలపై జేడీ, రాష్ట్ర పరిశీలకులు బి.విజయ్‌భాస్కర్ జిల్లా అధికారులతో సమీక్షించారు.

స్వయం ఉపాధి పొందాలి



రైతులకు యంత్రపరికరాలు అందజేస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ బీవీకే భగవాన్ తదితరులు

ఆమదాలవలస: కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొందిన కొబ్బరి రైతులు ఆ శిక్షణలో నేర్చుకున్న పద్ధతుల్లో చెట్లు ఎక్కుతూ, కొబ్బరి యాజమాన్యం చేస్తూ స్వయం ఉపాధి పొందేందుకు కృషిచేయాలని పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బీవీకే భగవాన్ సూచించారు. కేవీకేలో గత 6 రోజులుగా నిర్వహిస్తున్న కొబ్బరి రైతుల శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారందరికీ ఆదివారం చెట్టు ఎక్కేందుకు ఉపయోగించే పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్, మాస్టర్ ట్రైనర్ రఘు, శ్రీను, వివిధ ప్రాంతాలకు చెందిన కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

'ఎంఈఓ తీరు సరికాదు'

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఇన్‌చార్జి ఎంఈఓ గోవిందరావు టీడీపీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు, బాలికల హైస్కూల్ చైర్మన్ గోవిందరావు పండాతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎంఈఓ వ్యవహార శైలిపై ముఖ్యమంత్రితో పాటు, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు శనివారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సమాచారాన్ని టీడీపీ నాయకులకు తెలియజేస్తున్నారని, పాఠశాలలు తనిఖీ చేయకుండా విధులకు డుమ్మా కొడుతున్నారని ఆరోపించారు. స్థానిక బాలికల పాఠశాలలో వంట ఏజెన్సీ మహిళలను మార్చాలని తహసీల్దార్ ఆదేశించినా ఇంకా చేయలేదని తెలిపారు. కలెక్టర్ కూడా ఎంఈఓ పనితీరుపై దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి వేతనం పెంపు



శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు రోజు వారీ వేతనాన్ని ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు జీఓను విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఇది అమలులోకి వస్తుంది. ఇప్పటి వరకు గరిష్ఠ వేతనం రోజుకి రూ.257 లు ఉండగా, ఇక నుంచి రోజుకు రూ.15 పెంచింది. దీంతో రోజు గరిష్ఠ వేతనం రూ. 272కు చేరింది. ప్రస్తుతం జిల్లాలో 883 పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. సగటున రోజుకి 1,30,000 మంది వరకు వేతనదారులు పనులు చేస్తున్నారు.

ఘనంగా ఆగ్నేయ స్థాలీపాక హోమం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఆగ్నేయ స్థాలీపాక హోమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకబృందం ఈ హోమాన్ని ఆలయ మండపంలో నిర్వహించారు. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో ఆదిత్యుని కల్యాణం జరిగిన మరునాడే ఈ హోమాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అలాగే అరుంధతి నక్షత్ర పూజలను నిర్వహించారు. ఈ ప్రక్రియ అనంతరం ప్రత్యేక భోగాలను స్వామికి నివేదించారు. అంతకుముందు ఆదిత్యునికి ప్రత్యేక అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆగ్నేయ స్థాలీపాక హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ట్యాబ్‌ల వినియోగంపై టీచర్లకు ముగిసిన శిక్షణ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ ముగిసింది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులతోపాటు 8వ తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. పాఠశాలలకు సరఫరా చేసిన ట్యాబ్స్ ఉపయోగించే తీరుపై ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 5524 మంది ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు వెబెక్స్ ద్వారా వర్చువల్ శిక్షణ తరగతులను నిర్వహించారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)వమ్మరవిల్లిలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గార పగడాలమ్మ, డైట్ ప్రిన్సిపాల్, డీవైఈఓ డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య హాజరై టీచర్లకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ట్యాబ్స్ వినియోగించేటప్పుడు ఎదురయ్యే ప్రాథమికమైన టెక్నికల్ సమస్యలతోపాటు ట్యాబ్ వాడకంపై కనీస అవగాహన తప్పనిసరి అని నిర్దేశించారు. గ్రామ సచివాలయాల భాగస్వామ్యంపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 29పై కూడా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ పాల్గొని ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

క్రీస్తు స్మరణలో..



జిల్లావ్యాప్తంగా క్రీస్తు ఆరాధనా మందిరాల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం చిన్నబజారులో గల తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ ఎ.జాకబ్ సందేశాన్ని సూర్యమహల్ కూడలి వద్ద ఇచ్చారు. – శ్రీకాకుళం కల్చరల్

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం చేస్తున్న బెండి గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: బెండి గ్రామానికి చెందిన అల్లాడ మహలక్ష్మి గత కొద్ది రోజులుగా కేన్సర్‌తో బాధ పడుతున్నారు. ఆమె దీనస్థితిపై 'సాక్షి'లో కథనం వెలువడడంతో బెండి గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఆమెకు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. అంతా కలిసి రూ.1,09,170 విరాళంగా సేకరించి మహాలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు.

చిన్నారి చికిత్సకు దాతల చేయూత

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన లండ బూసయ్య ఐదేళ్ల కుమారుడు యోగేంద్రకు న్యూరో బ్యాస్టోమా అనే క్యాన్సర్ వ్యాధి సోకింది. ఈ చిన్నారి పరిస్థితిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. ఉద్దాన ప్రాంతం కవిటికి చెందిన ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ తరఫున రూ.20వేలు అందజేశారు. పవనపుత్ర సేవా సంస్థ వారు రూ.12వేలు ఆర్థిక సాయం అందించారు. కంచిలి మండలం అంపురం గ్రామస్తులు రూ.11,500లు సాయం చేశారు.



లండ యోగేంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు

నేటి నుంచి ఒంటి పూట బడులు

- ఉదయం 7.45 నుంచి 12.30 వరకు తరగతులు
- ప్రభుత్వ బడుల్లో పిల్లలు గోరుముద్ద తిన్నాకే ఇళ్లకు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సోమవారం నుంచి ఒంటి పూట బడులు మొదలుకానున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఒక్కపూట తరగతులను నిర్వహించనున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో 12.30 తర్వాత మధ్యాహ్న భోజనం జగనన్న గోరుముద్ద అందజేయనున్నారు. అనంతరం విద్యార్థులను వారి ఇళ్లకు పంపిస్తారు. ఒంటిపూట బడుల సమయంలోనూ నిర్దేశించిన మెనూ ప్రకారమే భోజనాలు అందించాలని అధికారులు స్పష్టం చేశారు.

అన్ని యాజమాన్యాలకు వర్తింపు..

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మోడల్‌స్కూల్స్, ఎయిడెడ్, ప్రైవేట్, గుర్తింపు పొందిన అన్‌ఎయిడెడ్ పాఠశాలలతో సహా అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలు ఒంటి పూట అమలు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. సోమవారం నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు ఒంటిపూట బడులు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. అయితే పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఆరు రోజులపాటు 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు క్లాసులు ఉండవు. అయితే ఈనెల 30వ తేదీలోగా రెండో శనివారంతో సహా ఆ ఆరు రోజుల పరిహార తరగతులను నిర్వహించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒంటి పూట బడులను నిర్వహించాల్సిందేనని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ సూచిస్తున్నారు.

పరీక్షా కాలం

- నేటి నుంచే టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- 149 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 29,575 మంది విద్యార్థులు
- నిమిషం నిబంధన అమలు
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు జిల్లాలో 149 కేంద్రాలను కేటాయించారు. 29,575 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28,855 మంది ఉండగా, ప్రైవేటు విద్యార్థులు 720 మంది ఉన్నారు. ఏ కేంద్రంలోనూ నేలరాతలు లేకుండా పక్కాగా ఫర్నీచర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. తనిఖీల కోసం విద్యా, రెవెన్యూ, పోలీసు శాఖల పర్యవేక్షణలో 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. మరో 10 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నారు. ప్రధానంగా 15 రూట్లను గుర్తించారు. ఇందుకుగాను 45 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. 20 వరకు రూట్లలో బస్సు సదుపాయాన్ని కల్పిస్తున్నారు. టెన్త్ హాల్‌టికెట్ చూపిస్తే ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా విద్యార్థులు ప్రయాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆర్టీసీ అధికారులు కూడా దీనిపై ప్రచారం చేశారు.

హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు..

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కేంద్రాలపై సందేహాల నివృత్తికి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాట్లు చేశారు. 08942-220724 నంబర్‌కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని డీఈఓ గార పగడాలమ్మ తెలిపారు.

పది పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, సమష్టిగా పనిచేసి జిల్లాకు పేరు తీసుకురావాలని టెన్త్ పరీక్షల రాష్ట్ర పరిశీలకులు, సమగ్రశిక్ష జేడీ బి.విజయభాస్కర్ విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం జిల్లాలోని పలు కేంద్రాలను సందర్శించి, ఫర్నీచర్, ఫ్యాన్లు, లైటింగ్, మరుగుదొడ్లు, ముఖ్యంగా తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పరీక్షల ఏర్పాట్లపై డీఈఓ గార పగడాలమ్మతో కలిసి మండలాల ఎంఈఓలు, పలు కేంద్రాల సీఎస్‌లు, డీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్ష కేంద్రంలోపలకు ఎవరూ సెల్‌ఫోన్ తీసుకురావడానికి లేదని, కేంద్రాలకు వెలుపలే సెల్‌ఫోన్లు ఉండాలని స్పష్టంచేశారు. కేంద్రంలో ఫోన్లు కనిపిస్తే దానికి బాధ్యుల్ని చేస్తూ కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాలకు కనీసం 100 మీటర్ల దూరంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను విధిగా మూసివేసేలా పోలీసులు బాధ్యత తీసుకోవాలన్నారు.



డీఈఓ, ఏసీలతో కలిసి ఎంఈఓలు, సీఎస్‌లు, డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేడీ విజయ్‌భాస్కర్



శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్ధంచేసిన ఫర్నీచర్‌తో ఉపాధ్యాయులు

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థులకు ఫౌండేషన్ స్కిల్స్ కోర్సు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్ ద్వారా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఫౌండేషన్ స్కిల్స్ అనే నూతన కోర్సు ప్రవేశపెట్టినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, కంప్యూటర్ స్కిల్స్, వైద్య సంబంధిత పాఠ్యాంశాలతో పాటు ప్రాథమిక వైద్య చికిత్స విధానాలను నేర్పిస్తామని పేర్కొన్నారు. బీఎస్సీ పారామెడికల్ డిగ్రీ కోర్సులు, బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్‌టీతో పాటు 12 పారామెడికల్ కోర్సుల్లోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9121999654, 7680945357 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భూసర్వే రాళ్లు తొలగిస్తే చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రైతుల పొలాలు, ప్రభుత్వ స్థలాల హద్దురాళ్లు వేస్తున్నామని, వాటిని తొలగించడం నేరమని శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.వెంకటరావు ఒక ప్రకటలో తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని, హద్దు రాళ్లు వేసే పనిలో రెవెన్యూ, సర్వే సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. అయితే కొన్నిచోట్ల ఆక్రమణదారులు, రైతులు హద్దు రాళ్లు తొలగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. భూ సర్వేచట్టం ప్రకారం అటువంటి వారు శిక్షార్హులని పేర్కొన్నారు.

ఘనంగా ధనరాజులమ్మ సంబరం



ఆకట్టుకున్న కోయనృత్య ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజులమ్మను ఆదివారం వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మపురం, తులసిగాం, జగన్నాథపురం, బిర్లంగి, ఒడిశా సుమాండీ, జయంతిపురం గ్రామ పరిసరాల నుంచి భక్తులు మేళతాళాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారిని ఊరేగింపుగా సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అమ్మవారి సన్నిధిలో మొక్కుబడులు తీర్చుకున్నారు.

'హడావుడి నిర్ణయాలు సరికాదు'



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో విద్యారంగంపై ఉన్నతాధికారుల హడావుడి విధానాలు, నిర్ణయాలు ఎంతమాత్రం సరికాదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు అన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయాల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరొస్తుందని చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని సంఘ కార్యాలయంలో ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పడాల తమ్మినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియారిటీ ప్రకారం ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టకుండా.. తాత్కాలిక పదోన్నతలతో కాలం గడిపేస్తున్నారని, 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ అయోమయంగా ఉందన్నారు. సరైన మార్గనిర్దేశకత్వం లేమితో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు అయోమయానికి గురి అవుతున్నారని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, జిల్లా ఆర్థిక కార్యదర్శి కంచరాన తేజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,670-00
బంగారం(22సి. 10గ్రా.)	54,700-00
వెండి (కిలో)	76,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹ 206

ఆధార్ అప్‌డేట్ చేశారా..?



కొయ్యాం సచివాలయానికి వచ్చిన ఆధార్ కార్డు లబ్ధిదారులు

- కార్డు పొంది పదేళ్లు పూర్తయితే చేయించాల్సిందే
- జూన్ 14 వరకు గడువు
- సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు
- ఆన్‌లైన్‌లో ఉచితం

ఎచ్చెర్ల : ప్రభుత్వ సంక్షేమ పథకాలు కావాలన్నా.. బ్యాంకింగ్ కార్యకలాపాలు కొనసాగించాలన్నా.. సెల్‌ఫోన్ సిమ్‌కార్డు పొందాలన్నా.. ఇలా ఒకటేమిటి ప్రతి అవసరానికి ఇప్పుడు ఆధార్ తప్పనిసరి. ఇంతటి కీలకమైన ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఆధార్ కార్డు పొంది పది సంవత్సరాలు గడిచిన వారు తప్పనిసరిగా అప్‌డేషన్ చేసుకోవాలని, లేదంటే ఆగస్టు నెలతో ఆధార్ కార్డు పని చేయదని ప్రభుత్వం చెబుతోంది.

ఉచితంగానే అప్‌డేట్..

ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన అవసరం లేదు. ఈ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. ఈ నెల 15 నుంచి అప్‌డేట్ ప్రక్రియ ప్రారంభించారు. జూన్ 14 వరకు మూడు నెలల పాటు ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు. కంప్యూటర్లో ఆధార్ అఫీషియల్ వెబ్‌సైట్ ద్వారా గానీ, మొబైల్‌లో ఎంఆధార్ యాప్‌లోనైనా ఈ ప్రక్రియను పూర్తిచేసుకోవచ్చు. దీనికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. అరచేతిలోనే ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం అందించింది. బ్యాంకులు, కామన్ సర్వీస్ కేంద్రాలు, సచివాలయాల్లో కూడా ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు.

గుర్తింపు పత్రం జత చేయాలి..

కొన్నిసార్లు వ్యక్తిగత వివరాలున్న ధ్రువపత్రాలు సమర్పించకపోయినా కేవలం ఒక అప్లికేషన్‌తో అప్పట్లో ఆధార్‌కార్డు మంజూరు చేశారు. అలాంటి వారితో పాటు కార్డు పొంది పదేళ్లు దాటిన వారు తప్పకుండా గుర్తింపు పత్రాలు, ఇతర ధ్రువపత్రాలను ఆధార్‌కు జతచేసి డాక్యుమెంట్ అప్‌డేషన్ చేసుకోవాలి. లేనిపక్షంలో ఈ ఏడాది ఆగస్టు 31 తరువాత కార్డు చెల్లుబాటులో ఉండదని అధికారులు చెబుతున్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం..

ప్రస్తుత అప్‌డేషన్‌లో భాగంగా ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు కూడా ప్రభుత్వం అవకాశం ఉంది. చిరునామా, ఫోన్‌నంబర్, తదితర వివరాలను మార్చుకోవచ్చు. ప్రభుత్వం ఆమోదించిన పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు ఐడీ, పాన్‌కార్డు, బ్యాంక్/పోస్టల్ పాస్‌బుక్, ఫొటోతో కూడిన రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌కార్డు, గుర్తింపు పొందిన విద్యా సంస్థలు జారీచేసే పత్రాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కార్డులు తదితర 13 రకాల ధ్రువపత్రాల ద్వారా ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవచ్చు.

సచివాలయాల్లోనూ అప్‌డేట్



ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఆధార్ పొందిన పదేళ్ల కాలంలో ఎప్పుడైనా డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకున్న వారికి ఫర్వాలేదు. మిగిలిన వారు మాత్రం అప్‌డేట్ చేసుకోవాలి. మండలానికి ఆధార్ అప్‌డేట్ కిట్లు ఐదు మాత్రమే ఇవ్వడం వల్ల రోజుకు 5 సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఆధార్ అప్‌డేట్ చేయిస్తున్నాం.

– కుమార్ పట్నాయక్, ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీఓ

నమో ఆదిత్యాయ..!

- అరసవల్లిలో భక్తజనం ప్రత్యేక పూజలు
- స్వామిని దర్శించుకున్న ప్రముఖులు



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు



కమిషనర్ అట్టాడ సిరికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. చైత్ర శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆరోగ్యం కోసం పలువురు భక్తులు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టికెట్ల ద్వారా రూ.2.44 లక్షలు, విరాళాలు, ఆర్జిత సేవల టికెట్ల ద్వారా రూ.73,161, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.10 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో వివరించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఐఏఎస్ అధికారులు

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం పలువురు ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ అట్టాడ సిరి, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. అమరావతి రాజధాని లక్ష్యంగా కొందరు ఉద్యమకారులు ప్రత్యేక బస్సులో అరసవల్లి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, పరిపాలనాధికారి కిల్లారి రామారావు, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, వీఆర్వో చంద్రభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

కవితల పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి పురస్కరించుకుని కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు అరసం అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రస్తుత సమాజం–తీరుతెన్నులు'లపై అభ్యుదయ ఆలోచనల సరళితో రచనలు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రేమ, అశ్లీల కవితలకు తావులేదని, అభ్యుదయ కవితలను మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 25లోగా 'విశాలాంధ్ర బుక్ హౌస్, కేరాఫ్ అరసం, రామలక్ష్మణ థియేటర్ కూడలి, శ్రీకాకుళం' చిరునామాకు కవితలు పంపించాలన్నారు. విజేతలైన ఐదుగురికి నగదు బహుమతులుంటాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 30న శ్రీశ్రీ జయంతి సందర్భంగా విజేతల పేర్లు ప్రకటించి అదే రోజు సత్కరిస్తామని తెలిపారు. వివరాలకు 8008679666 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ లక్ష్మున్నాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మున్నాయుడు అన్నారు. ఎచ్చెర్లలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఖరీఫ్ సాగు కార్యాచరణ ప్రణాళికపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ ధాన్యాల సాగు, రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగం లేని వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రకృతి సేద్యంలో భూసారం పెంచడం, పంటల యాజమాన్య ఖర్చులు తగ్గించటం కీలకమని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

డుమ్మా కొట్టారు.. డమ్మీ పెట్టారు!

- సర్వసభ్య సమావేశానికి హాజరుకాని వైద్యులు
- హెల్త్ సూపర్‌వైజర్ బదులుగా ఆమె భర్త హాజరు
- దండుగోపాలపురం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది తీరుపై విమర్శలు



సభ్యులకు సమాధానమిస్తున్న సూపర్‌వైజర్ దమయంతి భర్త సూర్యం

సంతబొమ్మాళి: మూడు నెలలకోసారి జరుగుతున్న సాధారణ సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు, సిబ్బంది డుమ్మా కొట్టడం, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దండుగోపాలపురం పీహెచ్‌సీకి చెందిన డాక్టర్లు, సిబ్బంది బాధ్యత మరిచి వ్యవహరించారు. వైద్య ఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో నౌపడ, దండుగోపాలపురం పీహెచ్‌సీల సిబ్బంది హాజరు కాగా, సంతబొమ్మాళి, బోరుభద్ర పీహెచ్‌సీల నుంచి ఎవరూ హాజరు కాలేదు. అయితే ఇక్కడే తమాషా జరిగింది. దండుగోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు అజయ్‌కుమార్, సుధీర్‌లు ఇద్దరూ సమావేశానికి హాజరు కాలేదు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ దమయంతి తరఫున ఆమె భర్త సూర్యం హాజరయ్యారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయనే సమాధానాలు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగి కానప్పటికి సభ్యుల ముందుకు వచ్చి సమాధానం చెప్పడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. భార్యకు బదులుగా భర్త సమావేశానికి రావడం, సభ్యులు ఎవరూ గమనించకపోవడం ఇక్కడ కొసమెరుపు.

పలాసలో మరో పారిశ్రామికవాడ



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పలాసలో రామకృష్ణాపురం సమీపంలో మరో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ యతిరాజులు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే రెవెన్యూ విభాగం నుంచి పారిశ్రామికవాడకు భూమి మంజూరు చేశామని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు త్వరలోనే కేటాయింపులు చేస్తామని చెప్పారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఏపీఐఐసీ మేనేజర్ రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్‌కుమార్, పలాస కాష్యూ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లా సురేష్, కె.వి.శివకృష్ణ, పి.రవికాంత్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సభ్యులు ఎం.రామేశ్వరరావు, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని హయాతినగరం సాయిరాం గుడి వద్ద ఓ వ్యక్తిపై ముగ్గురు దాడి చేసినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన ముద్దాడ రామ్మూర్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 1న అదే గ్రామానికి చెందిన సింధు రాజారావుతో కలిసి ఇసుకబండి తోలేందుకు అతని బైక్‌పైనే శ్రీకాకుళం వస్తుండగా కిందపడ్డాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్యా స్వల్ప ఘర్షణ జరిగింది. అదే రోజు రాత్రి తొమ్మిది గంటలకు హయాతినగరం సాయిరాం గుడి వద్ద రామ్మూర్తి ఉండగా రాజారావు, అతని కుమారుడు గణేష్, సోదరుడు వచ్చి కర్రలతో దాడి చేశారు. అనంతరం బాధితుడ్ని ఇంటి వద్ద దించేశారు. రామ్మూర్తిని కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



గెడ్డ వద్ద రాము మృతదేహం

లావేరు: మండలంలోని మురపాక గ్రామానికి చెందిన గనమాన రాము(35) ఆదివారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాము లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన బి.నీలయ్య అనే పెద్దమేస్త్రీ వద్ద కాంక్రీట్ పనులకు కూలీగా వెళ్తుండేవాడు. ఆదివారం వేకువజామున 3.30 సమయంలో నీలయ్య రాముకు ఫోన్ చేసి పని కోసం వేరేచోటకు వెళ్లాలని, తొందరగా రావాలని చెప్పడంతో 4 గంటల సమయంలో రాము తన ద్విచక్రవాహనంతో బయలుదేరివెళ్లాడు. ఉదయం చిన్నయ్యపేట గ్రామానికి వెళుతున్న పోలీసులకు బయ్యన్నపేట జంక్షన్ సమీపంలో ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ రోడ్డు పక్కన పడి ఉండటాన్ని గమనించారు. సెల్‌ఫోన్ ఆన్‌చేసి చివరి డయల్ నంబర్‌కు కాల్ చేయగా మేస్త్రీ నీలయ్య లిఫ్టు చేశాడు. అతను రాము సోదరుడికి విషయం చెప్పడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బయ్యన్నపేట, పెదరావుపల్లి గ్రామాల మధ్య వెతకగా పెద్ద గెడ్డ వద్ద రాము మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. శ్రీకాకుళం డీఎస్పీ ఎం.మహేంద్ర, జేఆర్‌పురం సీఐ ఆదాం కూడా మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ అధికారులు, సిబ్బంది వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రాము మృతితో కుటుంబం జీవనాధారం కోల్పోయింది. రామును ఎవరో చంపేసి గెడ్డ వద్ద పడేశారని భార్య, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ఆసరా సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

లబ్ధిదారుల సంతోషమే

ప్రభుత్వ సిద్ధాంతం



సమావేశానికి భారీగా హాజరైన మహిళ సంఘ సభ్యులు

- పార్టీలకు అతీతంగా పథకాల అమలు
- ఆసరా సభలో మంత్రి ధర్మాన

రణస్థలం: 'పార్టీ జెండా చూడొద్దు. ఓటు వేశారో లేదో అడగవద్దు. ఇంటిపై ఎవరి జెండా ఉన్నా పట్టించుకోవద్దు.. రేపు ఓటు వేస్తారో లేదో చూడవద్దు.. పథకాలకు అర్హత ఉంటే చాలు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించాలి.. వారి కళ్లలో సంతోషం చూడాలి.. ఇదే తమ పార్టీ సిద్ధాంతం.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆచరించి చూపిస్తున్న విధానం..' అని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రణస్థలం మండలం జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సారథ్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 ముందు ఎన్నికల సమయంలో టీడీపీకి ఓటు వేస్తే మీకున్న అప్పులన్నీచెల్లిస్తామని ఓ పెద్ద మనిషి చెప్పారని, తీరా అధికారంలోకి వచ్చాక ప్రజల సొమ్మును దోచుకున్నారని మండిపడ్డారు. 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక చెప్పినవే కాకుండా చెప్పనవి కూడా అమలు చేసి అండగా ఉంటున్నారని చెప్పారు. సీఎం జగనన్న ఆశలన్నీ అక్కచెల్లమ్మలపైనేనని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయం మాదే



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- ఆసరా చెక్కుల పంపిణీలో మంత్రి సీదిరి అప్పలరాజు



ఆకట్టుకున్న ఆసరా సంబరాల ఆకృతి

కాశీబుగ్గ: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంతో పాటు పలాస నియోజకవర్గంలో గెలిచి తీరుతామని, చంద్రబాబు నక్కజిత్తులు పనిచేయవని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సంత మైదానంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమం స్థానిక కౌన్సిలర్, పార్టీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. 31 వార్డులకు చెందిన 8301 మంది మహిళా సంఘాల సభ్యులకు రూ.7 కోట్ల 31 లక్షల 70 వేల చెక్కులను మంత్రి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, ప్రభుత్వ విప్ శంకర్‌పండా, సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావుదొర, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, సచివాలయ కన్వీనర్ బడగల బళ్లయ్య నాయుడు, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, జోగి సతీష్, సనపల సింహాచలం, సవర సోమేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్, గౌరీ త్యాడి, రోణంకి శ్రీనివాసరావు, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, టీఎంసీ బోర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆకృతి..

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఉప్పు, రంగులతో వేసిన ఆసరా ముగ్గులు ఆకట్టుకున్నాయి. మున్సిపాలిటీ మెప్మా విభాగానికి చెందిన ఆర్‌పీ హేమలత నేతృత్వంలో వేసిన ఆసరా ఆకృతులను మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు అధికారులు, నాయకులు తిలకించి అభినందించారు.

జలంత్ర పోలమ్మకు వెండి కిరీటం వితరణ



వెండి కిరీటాన్ని అందజేస్తున్న దాతలు

సోంపేట: సోంపేట పట్టణంలో వెలసిన జలంత్ర పోలమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన వూన మనోజ్ రూ.80 వేలు విలువైన వెండి కిరీటాన్ని ఆదివారం బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మనోజ్‌ను అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ We are giving coaching for EAMCET, POLITECHNIC ENTRANCE, IIT-JEE, NEET. Con: 9110723438, 9573968872 [G-6621]

SERVICES

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1800]

WANTED

■ గ్లోబల్ సర్టిఫైడ్ కంపెనీ నందు గొప్ప అవకాశం. ఇంటి వద్ద చేస్తూ నెలకు 20 వేలు పైన సంపాదన, నిరుద్యోగులు, గృహిణులు, 18+అందరు అర్హులే ✆ 83175 92531 [B-990]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795294]

■ మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లలో అనుభవం ఉన్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. (ప్రాఫిట్‌లో షేర్ ఇవ్వబడును). Mega Group Man Power & Security (AP & TS). Contact : 70326 10569, 70931 25169. [NA-5476]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k - 18k ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899 [HA-1164]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ, 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995365999 [HA-1151]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.